క్లుప్తంగా

నేడు మండల మీట్

నింద్ర: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, తప్పక హాజరు కావాలని కోరారు.

పేదలకు వస్త్రదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నగరి : స్థానిక ఓంశక్తి ఆలయ 37వ వార్షికోత్సవం, 31వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఓంశక్తి ఆలయంలో మంగళవారం అభిషేక అర్చనలు, 1008 పుష్పార్చనలు, పంచముఖ దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం, వస్త్రదానంతో పాటు జీవనోపాధి లేని కుటుంబాలకు ఆసరాగా చేతి పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రచార కమిటీ అధ్యక్షుడు గంగాధర్, టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్ రమణ, కిషోర్ బాబు, దాతలు, ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

రుయా దొంగ దొరికాడు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలోని వయోవృద్ధుల చికిత్స వార్డులో ఇటీవల ఓ వృద్ధురాలు నుంచి కమ్మలు కాజేసిన వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ సిబ్బంది కథనం.. రుయా ప్రాంగణంలో అనుమానంగా తిరుగుతున్న మహేష్ అనే వ్యక్తిని పట్టుకుని గతంలో కమ్మలు కాజేసిన సందర్భంలో సేకరించిన ఫొటోలను పరిశీలించారు. ఫొటో మ్యాచ్ అవడంతో సిబ్బంది మంగళవారం వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే వ్యక్తి గతంలో మెటర్నిటీ ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తూ.. రోగుల నుంచి మొబైల్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో అతన్ని విధుల నుంచి తొలగించారు. పట్టుబడ్డ మహేష్‌ను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

కాపులకే కాపుగాస్తారా పవన్..?



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి రవి


శ్రీకాళహస్తి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాపు సామాజిక వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తారా అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ప్రశ్నించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు వరదయ్యపాళెంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారన్నారు. ఇందుకు నిరసనగా జనసేన నాయకులు సీఎం దిష్టి బొమ్మను దగ్ధం చేయబోతుంటే పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. అందులో యోగేష్ అనే బీటెక్ విద్యార్థి కూడా ఉన్నాడని చెప్పారు. రిమాండ్‌లో ఉన్న కారణంగా సెమిస్టర్‌కు దూరం కావాల్సి వచ్చిందన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన కార్యకర్త కొట్టే సాయిపై సీఐ అంజుయాదవ్ చెయ్యి చేసుకుంటే మాత్రం ఆఘమేఘాలపై పవన్ కల్యాణ్ వచ్చి ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారన్నారు. కానీ వరదయ్యపాళెం ఘటనను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ రిమాండ్‌లో ఉన్న దళిత జనసేన కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు.

మేకను కబళిస్తుండగా..



మేకను మింగుతున్న కొండచిలువ

నారాయణవనం: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో మంగళవారం కొండచిలువ బారి నుంచి ఓ మేకను రక్షించారు. వివరాలు.. దళితవాడకు చెందిన అన్నెమ్మ తన మేకలను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేత కోసం తోలుకెళ్లింది. మధ్యాహ్నం మందలో ఒక మేక తగ్గడంతో ఆమెతో కలిసి తోటి కాపరులతో కలిసి అడవిలో గాలింపు చేపట్టారు ఓ కొండచిలువ మేకను మింగేందుకు యత్నిస్తుండడాన్ని గుర్తించారు. కొండచిలువను చంపి మేకను రక్షించారు. కొండచిలువ సుమారు 10 అడుగుల పొడవు ఉందని వారు తెలిపారు.



కాపరులు చంపిన కొండచిలువ

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం



జగనన్న కాలనీలో భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్‌కే రోజా

- మహాత్ముడి గ్రామస్వరాజ్యం కలను సాకారం చేసిన ఘనత సీఎం జగనన్నదే
- గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు
- పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తున్నాం
- 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు దోచుకోవడం తప్ప ప్రజలకు ఏమి చేశారు?
- మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ఒక మహోన్నతమైనదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన క్రీడలశాఖా మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం కొప్పేడు సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె జగనన్న కాలనీలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి మనసున్న జగనన్న మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టం అన్నారు. అలాగే తనను రెండుసార్లు నగరి నుంచి ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మీ ప్రతి అడుగులే వెన్నంటే ఉంటానని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఈ రోజు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చి మహాత్ముడి కల అయిన గ్రామస్వరాజ్యం సాకారం చేసిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలను సీఎం జగనన్న గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు పంపించారని తెలిపారు. ప్రజాప్రతినిధులంతా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందాయా ? లేదా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా ? అని తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించారని చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేత అయినా ఎవరికైనా పథకాలు రాకపోతే, వారికి కూడా అందేలా చేయడానికి ఇప్పుడు జగనన్న సురక్ష అనే మహోన్నత కార్యక్రమానికి సీఎం జగనన్న శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ సందర్భంగా కొప్పేడు సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 98 మందికి మంత్రి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. తమ సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం జగనన్నకు, మంత్రి రోజాకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.

14 ఏళ్లలో ఏం చేశావ్ చంద్రబాబు..!

చంద్రబాబు నాయుడు 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు ఏం చేశాడో చెప్పాలని, కనీసం తల్లులకు అమ్మఒడి, పేదలకు వైఎస్సార్ చేయూత, ఇళ్లు ఇచ్చాడా ? అని చెప్పాలని మంత్రి రోజా ప్రశ్నించారు. కొప్పేడు సచివాలయ పరిధిలో నవరత్నాల పథకాల ద్వారా రూ.7.66 లక్షలను సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని, అలాగే 27 మందికి ఇళ్లు కట్టించడం జరిగిందన్నారు. అలాగే కొప్పేడు పంచాయతీలో ఇప్పటివరకు రూ.30 లక్షల మేర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దాదాపు 795 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. గ్రామంలో ఓపెన్ జిమ్, కబడ్డీ క్రీడాకారుల కోసం మినీ కబడ్డీ గ్రౌండ్ ఏర్పాటు చేస్తామని క్రీడాకారులకు మంత్రి రోజా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కబడ్డీ క్రీడాకారులు మంత్రి రోజాను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, నగరి ఆర్డీఓ సుజన, మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ అరుణ, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఏఈ శ్రీధర్ రాజు, తహసీల్దార్ అమరేంద్రబాబు, మండల కన్వీనర్ వేణురాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, కోఆప్షన్ సభ్యులు అనిల్‌కుమార్, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, ఎంపీటీసీ సభ్యులు విజేష్, ఆర్‌బీకే డైరెక్టర్ చెంచమ్మ, మండల సచివాలయ కన్వీనర్ బాబు రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, ఎంఈఓ శ్రీధర్‌రాజు, ఏపీఎం చంద్రకళ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొమరగుంట గ్రామ సచివాలయ పరిధిలోని జీటీ కండ్రిగ గ్రామం నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి వివరిస్తారన్నారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

వెన్నశాతం ఆధారంగా పాల ధర



మహిళా పాడి రైతులకు స్టీల్ బకెట్లను అందిస్తున్న సూపర్‌వైజర్

పాలసముద్రం : మండల పరిధిలోని శ్రీజ మహిళా సొసైటీ మిల్క్ డెయిరీలో పాలలో వెన్నశాతం ఆధారంగా పాల ధర వస్తుందని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, డెయిరీ సూపర్‌వైజర్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురంలో పాడి రైతులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సూపర్‌వైజర్ రిగన్ మాట్లాడుతూ శ్రీజ పాల డెయిరీలో పాలు పోస్తున్న పాడి రైతులకు మంచి ధరలు అందిస్తున్నామని, ఏటా బోనస్ ఇస్తున్నామని తెలిపారు. సబ్సిడీ ధరకే పశు దాణా, ఉచితంగా పాడి పశువులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పాడి రైతులు ప్రైవేటు వారికి పాలు పోయకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీజ పాల డెయిరీకి పాలు పోయాలన్నారు. అనంతర శ్రీజ పాల డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు 5 లీటర్ల స్టీల్ బకెట్లను ఉచితంగా అందించారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేశారు. అలాగే సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన వీరాస్వామియాదవ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక అభిషేక, పూజలు చేపట్టారు. అనంతరం వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష



సర్టిఫికెట్లు అందుకున్న వారితో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరి : ప్రజాసమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష అని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తడుకుపేట సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వారు ఉన్న ప్రాంతాల్లోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, బియ్యంకార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు అంటూ 11 రకాల సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీఓ లీలామాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక అధికారి వాసు, మండల సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రభుత్వ సేవలను సత్వరమే అందించడమే గాక ప్రజా సమస్యలను వందశాతం పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యం అని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. మంగళవారం బాలకృష్ణాపురం గ్రామ సచివాలయ పరిధిలో సర్పంచ్ శోభ, ఎంపీటీసీ లిఖిత సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా వారు పలువురు లబ్ధిదారులకు అధికారుల కలిసి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీపీ ప్రేమ్‌కుమార్, ఏఓ డిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, హౌసింగ్ ఏఈ దాము, మండల విస్తరణాధికారి రమేష్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలకేంద్రంలోని సచివాలయం–2, కత్తెరపల్లి సచివాలయాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం ఎంపీడీఓ మోహన్‌మురళితో కలిసి ఆయన సుమారు 350 మందికి ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనుంజయవర్మ, కుప్పయ్య, లోకనాథనాయుడు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి త్రిశూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై నుంచి కటాక్షిస్తున్న ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: ఆండాళ్ అమ్మవారు మంగళవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరించారు. స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు ఈనెల 13న గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. స్వామి అష్టదల పాదపద్మారాధన సేవను నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేపట్టారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు హారతులు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి అర్చకులు ఆస్థానం నిర్వహించారు.

పామును తప్పించబోయి..

కేవీబీపురం: అకస్మాత్తుగా పాము రోడ్డుకు అడ్డంగా రావడంతో ఆగి ఉన్న 108 వాహనాన్ని ఢీకొట్టి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని రాగిగుంట జెడ్పీ పాఠశాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం.. పిచ్చాటూరు మండలానికి చెందిన రాకేష్ శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలలో జరిగిన సెమిస్టర్ పరీక్షకు హాజరై మరో ఇద్దరు యువకులతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. రాగిగుంట కూడలి సమీపంలో పాము రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడంత దానిని తప్పించే క్రమంలో ఆగి ఉన్న 108 వాహనాన్ని యువకులు ఢీకొట్టారు. ఈ ఘటనలో రాకేష్(18) అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి

శ్రీరంగరాజపురం : సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపైనే ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని ఆరోగ్య, ఆశావర్కర్లతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలన్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కార్మికులు



చిదా స్పిన్నింగ్ మిల్లు



నిరసన తెలుపుతున్న కార్మికులు

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లు వ్యవహారం 'గోటితో పోయేదాన్ని గొడ్డలి దాక తెచ్చుకోవడం' అనే సామెతను గుర్తుకు తెస్తోంది. మిల్లును అర్ధాంతరంగా మూసివేసిన యాజమాన్యం కార్మికులకు న్యాయపరంగా చెల్లించాల్సిన నష్టపరిహారం చెల్లించడంలో మొండి వైఖరిని అవలంభించింది. దీనిపై సీఐటీయూ అధ్యక్షుడు ఏ.బాబు మరో 15 మంది కార్మికులు ఈనెల 17 సోమవారం రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. అదే రోజు నంబర్ కావడంతో ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్, అమరావతి వారిని, కమిషనర్ ఆఫ్ లేబర్, విజయవాడ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, తిరుపతి, చిదా స్పిన్నింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్, పుత్తూరు వారిని ప్రతివాదులుగా చేసి నోటీసులు జారీ అయ్యాయి. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు మిల్లును విక్రయించడం గానీ, అందులోని యంత్రాలను తరలించడం గానీ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసింది.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

- అర్హతే కొలమానం.. అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



సమస్యలను తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ.. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజాసమస్యలను తెలుసుకోవడంతో పరిష్కార మార్గాలు చూపుతూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రజలకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన వెదురుకుప్పం గ్రామ సచివాలయ పరిధిలోని తంగేళిమిట్ట, వెదురుకుప్పం, సీఆర్‌కండ్రిగ, తూర్పు దళితవాడ, సీఆర్‌కండ్రిగ దళివాడ, పాలకుంటచేను గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి వారికి ఎంత సాయం అందిందో వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గుర్తించి వెంటనే అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను విని తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామంటూ ప్రజలకు చెప్పారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రికి మహిళలు మంగళహారతులు, కర్పూర నీరాజనాలు పలికారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

అందరికీ పథకాలు అందాలి

సీఎం జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న పథకాలకు కేవలం అర్హతే ప్రామాణికమని, పథకాల లబ్ధిలో ఎలాంటి తారతమ్యాలకు తావివ్వకుండా అందిస్తున్నామని ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న వారికి ప్రతి పథకాన్ని ప్రభుత్వం నేరుగా అందిస్తోందన్నారు. ప్రతి ఇంట్లోనూ సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నామని ఆనందంగా చెబుతున్నారని తెలిపారు. ఇప్పుడు జగనన్న సురక్షలో ఇప్పటికీ ఏదైనా కారణం చేత పథకాలు అందని వారిని గుర్తించి పథకాలను వర్తింప చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జగనన్న పాలన ప్రేమ, కరుణ, వాత్సల్యంతో కూడుకుంటే, కానీ చంద్రబాబు పాలన మాత్రం పగ, కక్షలు, కార్పణ్యాలతో సాగిందని గుర్తు చేశారు. దుర్మార్గంగా ఆలోచించే చంద్రబాబు కుట్రలకు ప్రజలెవరూ బలి కావొద్దన్నారు. ప్రతి ఇంటికీ మేలు చేస్తున్న సీఎం జగనన్నను, మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదరర్శి కోలార్ ప్రకాష్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పేట ధనంజయ రెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ ఎంపీపీ జ్ఞానకొండారెడ్డి, సర్పంచ్‌లు శిల్ప, గోవిందయ్య, ఎంపీటీసీ రాధిక, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు నీరజ రాధారెడ్డి, హనుమంత రెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, విక్కీ, ఉమాపతిరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



సత్యవేడులో సర్టిఫికెట్లు చూపుతున్న లబ్ధిదారులు

సత్యవేడు: రాష్ట్రప్రభుత్వం ప్రజల ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ సేవలను ఉచితంగా తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం సత్యవేడు–3, మదనంబేడులో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సత్యవేడు–3లో 725 మందికి, మదనంబేడులో 691 మందికి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలురకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కే.చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, సచివాలయ కన్వీనర్లు మునికృష్ణయ్య, ఆనందయ్య, సర్పంచులు మంజుల, శివరంజని, నాయకులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దారు రవిచంద్ర, ఆర్‌ఐ కిరణ్, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.